నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 4 మార్చి 2025 | HYDERABAD




సోమవారం లంగర్‌హౌజ్‌లోని ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను సీజ్ చేస్తున్న అధికారులు



రాజేంద్రనగర్‌లో సోమవారం బీఆర్ ఎస్ పార్టీలో చేరిన కార్యకర్తలతో నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి

## ఇన్నేళ్లు చోద్యం చూసి..

# ఇప్పుడు రద్దు చేసి

**అధికారుల మౌనం.. 800 మంది విద్యార్థులకు శాపం!**

**ఆందోళనలో 800 మంది విద్యార్థుల భవిత**

లంగర్‌హౌజ్‌లోని ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రద్దు

అనుమతి లేదని తేల్చిన హైదరాబాద్ విద్యాశాఖ అధికారులు

ఇన్ని నెలలు ఏం చేశారంటూ తల్లిదండ్రుల ఆగ్రహం

పరీక్షల సమయంలో మరో స్కూల్‌కు మార్చడంపై విమర్శలు

వచ్చే ఏడాది అడ్మిషన్లు కూడా ఆహ్వానించిన స్కూల్

చెల్లించిన ఫీజులు వెనక్కి ఇప్పిస్తారా?

సిటీబ్యూరో/ మెహిదీపట్నం, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : తాంబూలం ఇచ్చాం.. తన్నుకు చావండి అన్న చందంగా హైదరాబాద్ విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. కార్వాన్‌లోని లంగర్ హౌజ్ లోని ఆర్చిడ్స్ ఇంటర్నేషన్ స్కూల్‌కు అనుమతి లేదని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారులు సోమవారం రద్దు చేశారు. అయితే ఈ రద్దు నిర్ణయంపై తల్లింద్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 800 మంది విద్యార్థులు ఇందులో విద్యనభ్యసిస్తున్నారు. ఇన్ని నెలలుగా స్కూల్ నడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోని విద్యాశాఖ అధికారులు మరో నెలన్నర రోజులైతే అకాడమిక్ పూర్తై వేసవి సెలవులు రాబోతున్న సమయంలో పాఠశాలకు అనుమతి లేదని చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పాఠశాల ఏర్పాటుకు ప్రాథమిక అనుమతినిచ్చినా విద్యాశాఖాధికారులు అడ్మిషన్లు జరుగుతున్న సమయంలోనూ నోరు మెదపకుండా చోద్యం చూశారు. నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. తీరా అకాడమిక్ ముగింపునకు వస్తున్న సమయంలో పాఠశాలను రద్దు చేయడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇప్పుడు జీహెచ్‌ఎంసీ నోఓసీ, ఫైర్ ఎన్‌ఓసీ, ట్రాఫిక్ ఎన్‌ఓసీ లేదని స్కూల్ రద్దు చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. స్కూల్‌కు అనుమతి లేని విషయం తల్లిదంద్రులకు ఎలా తెలుస్తుందని.. అంత పెద్ద బిల్డింగ్ నిర్మాణం జరిగి అది స్కూల్‌గా ఏర్పాటు చేస్తున్నా జిల్లా విద్యాశాఖాధికారికి కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని రాజు అనే పేరేంట్ ప్రశ్నించారు. ఇప్పుడు వేరే స్కూల్‌లో అడ్మిషన్ పొందాలంటే చాలా కష్టమని తెలిపాడు. పరీక్షల సమయంలో వేరే స్కూల్‌లో జాయిన్ చేస్తే అక్కడి వాతావరణం, కొత్త విద్యార్థులు, టీచర్లతో కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. చెల్లించిన ఫీజులు వెనక్కి ఇప్పిస్తారా అంటూ ప్రశ్నించాడు. కాగా, ఇదే ప్రాంతలో కిలో మీటర్ లోపున ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు అడ్మిషన్లు అందేల చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

### బాధ్యత లేని విద్యాశాఖ..!

జిల్లాలో 3వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి. చాలా ప్రయివేట్ పాఠశాలలు అనుమతి లేకుండానే నడుస్తున్నాయని విద్యార్థి సంఘాలు జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం ఉండటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా చీకటి గదుల్లో పాఠశాలలను నడుపుతూ డబ్బులు దండుకుంటున్నారు. ఎలాంటి ఫైర్ సేఫ్టీ కూడా ఉండటం లేదు. ముఖ్యంగా ఎలాంటి ఆటస్థలం కూడా ఉండటం లేదు. రద్దీగా ఉండే రహదారుల పక్కన ఉన్న పురాతన భవనాల్లో సైతం పాఠశాలలను ఏర్పాటు చేసి బోర్డులు తగిలిస్తున్నారు. ఇక ఫీజులపై విద్యాశాఖ అధికారుల నియంత్రనే లేదని తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్న హైదరాబాద్ విద్యాశాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్టు కేవలం ఫిర్యాదు వస్తేనే స్పందించి చేతులు దులుపుకుంటున్నారు. నిబంధనలు లేని పాఠశాల యాజమాన్యాలు కొందరి అధికారులకు డబ్బులను ఎరవేసి అక్రమాలకు పాల్పడుతున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

## సిటీ రోడ్లపై మళ్లీ చెత్త డబ్బాలు!

**1000 చోట్లకు గానూ 121 ప్రాంతాల్లో ఏర్పాటు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్ నగరంలో చెత్త రహిత నగరంగా రోడ్లపై ఎక్కడా గార్బేజ్‌బిన్‌లు లేకుండా చూస్తే ఈ ప్రభుత్వం చెత్త డబ్బాలను తిరిగి ఏర్పాటు చేయనుంది. చెత్త రహిత నగరమే లక్ష్యమని జీహెచ్‌ఎంసీ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల నుంచి గల్లీ రోడ్ల దాకా చెత్త పేరుకుపోతున్నది. ప్రధానంగా జీవీపీ (తరచూ చెత్త వేసే ప్రాంతాలు) పాయింట్ల ఎత్తివేతలో జీహెచ్‌ఎంసీ విఫలం చెందింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ రోడ్లపై డంపర్ బిన్లు (చెత్త డబ్బాలు) ఏర్పాటు చేస్తున్నారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లకు గానూ 1000 డంపర్ బిన్లను కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలోనే చార్మినార్‌లో 115, ఖైరతాబాద్ జోన్‌లో ఆరు ప్రాంతాల్లో డంపర్ బిన్లు (స్మార్ట్ బిన్లు)ను ఏర్పాటు చేశారు. కాగా స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా చేసేందుకు గానూ డస్ట్ బిన్ ఫ్రీ సిటీగా మార్చాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త డబ్బాలను ఎత్తివేసింది. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల వెంబడి చెత్త డబ్బాలను దాదాపు 800 చోట్లకుపైగా తగ్గించే కార్యక్రమాలను పక్కాగా ఆమలు చేసింది. పెరిగిన జనాభా, కాలనీలలో చెత్త ఉత్పత్తి పెరిగినప్పటికీ అందుకు అనుగుణంగా తరలించే స్వచ్ఛ ఆటోలు, వాహనాలను పెంచుతూ వచ్చారు. వీధి వ్యాపారులు (స్ట్రీట్ వెండర్స్) తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ గ్రేటర్ రోడ్లపై డంపర్ బిన్లు తెరపైకి తీసుకురావడం, స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో భాగంగా మార్కులు తగ్గుతాయని తెలిసిన ఈ డంపర్ బిన్లు ఏర్పాటు చేయడం గమనార్హం.






ఐఎస్ సదన్ వద్ద నత్త నడకన సాగుతున్న నిర్మాణం

## కాలయాపన..

# నరకయాతన

లక్ష్యం తప్పి నత్తనడకలా.. ఎస్ఎన్‌డీపీ

గడువు పెంచుకుంటూ

ఆలస్యం చేస్తున్న అధికారులు

నెలల తరబడి సాగుతున్న

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి

పనులు జరుగుతున్న 5 చోట్ల ట్రాఫిక్

పెరుగుతున్న ప్రాజెక్టు అంచనాలతో

ఖజానాపై భారం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్.ఆర్.డి.పి) పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విపరీతంగా కాలయాపన చేస్తున్నది. నిర్దేశిత లక్ష్యంలోపు పూర్తి కావాల్సిన ప్రాజెక్టులు నెలల తరబడి జాప్యం అవుతున్నాయి. దీంతో ముఖ్యమైన కూడళ్లలో నిత్యం నగరవాసులు నగర యాతన పడుతున్నారు.

### ఒక్క వంతెనకే 96 కోట్లు పెంచారు

వేర్వేరు కారణాలు చూపించి అధికారులు ప్రతి ప్రాజెక్టులో 20 నుంచి 30 శాతం పెరుగుదల చూపిస్తున్నారు. దీంతో ఖజానాపై భారం పడుతున్నది. నల్గొండ క్రాస్ రోడ్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ –ఓవైసీ జంక్షన్ కారిడార్ వరకు నిర్మితమవుతున్న స్టీల్ బ్రిడ్జి ప్రాజెక్టు వ్యయం రూ.523.37 కోట్లు ఉంటే ఇటీవల రూ. 620 కోట్లకు పెంచారు. జీహెచ్‌ఎంసీ ఖజానాపై రూ. 96.63 కోట్ల భారం పడడమే ఇందుకు నిదర్శనం . ఇప్పటికే సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు శాస్త్రీపురం, ఫలక్‌నుమా ఆర్వోబీ ప్రాజెక్టులు అందుబాటులోకి రావాల్సి ఉన్నప్పటికీ పనులపై తీవ్ర జాప్యం నెలకొంది. అంతే కాకుండా శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ పనులకు నేటికీ భూ సేకరణ చిక్కులు తొలగడం లేదు. మొత్తంగా 5 చోట్ల ప్రాజెక్టులకు నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసినప్పటికీ సకాలంలో అందుబాటులోకి రావడమే కష్టమేనని స్వయంగా అధికారులే చెబుతున్నారు. పనుల్లో వేగం పెంచాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో ప్రాజెక్టు ఖర్చు పెరగడంతో పాటు ట్రాఫిక్ కష్టాలు అధికమవుతుండడం పట్ల నగరవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఎస్ఆర్‌డీపీ తొలి విడత పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### నత్త నడకన శిల్ప లేఅవుట్ ఫేజ్-2

శేరిలింగంపల్లి, మార్చి 03: ఎస్ఆర్‌డీపీ కింద చేపట్టిన 17వ ప్రాజెక్ట్, శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ ఫేజ్–2 పనులు నత్తనడకన సాగుతున్నాయి. మార్చి నెలాఖరుకు పూర్తి కావాల్సిన తుది దశ నిర్మాణ పనులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో పనులు ఆలస్యంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా స్థల సేకరణ పనులు ఆలస్యమై తీవ్ర జాప్యం తలెత్తడంతో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు ఫేజ్ 2లో భాగంగా ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వరకు 816 మీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో మరో పని జరుగుతోంది. కొండాపూర్ వైపు అప్ ర్యాంప్ 475 మీటర్ల పొడవు మరియు 12 మీటర్ల వెడల్పు ఫ్లైఓవర్, కొండాపూర్ నుండి గచ్చిబౌలి వరకు డౌన్ ర్యాంప్ 305 మీటర్ల పొడవు మరియు 12 మీటర్ల వెడల్పుతో చేపట్టాల్సి ఉంది.

### ఉప్పల్ జంక్షన్ ఫ్లైఓవర్ ఇంకెప్పుడో..

గడిచిన ఏడాది కాలంలో ఎస్ఆర్‌డీపీ పనుల పురోగతిలో వేగం మందగించింది. ఈ నేపథ్యంలోనే శాస్త్రీపురం (రూ.71కోట్లు), ఫలక్‌నుమా ఆర్వోబీ రూ.47.10కోట్లు, శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ స్టేజ్–2 రూ. 275కోట్లు, నల్గొండ క్రాస్‌రోడ్ స్టీల్ బ్రిడ్జి రూ. 370 కోట్లతో పనులు నడుస్తున్నాయి. ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్ రూ. 311 కోట్లతో చేపట్టగా, ప్రాజెక్టు పూర్తి అయ్యే నాటికి మరో 30శాతం మేర అదనంగా భారం ఖజానాపై పడే అవకాశాలు లేకపోలేదు. మొత్తంగా జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారడం, టెండర్ల పిలుపు నుంచి సంబంధిత ప్రాజెక్టు పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. సీఈ నుంచి ఎస్ఈలను అదనపు బాధ్యతల భారాన్ని తగ్గించి ఇంజనీరింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, ఈ దిశగా కమిషనర్ చొరవ తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు

### కేసీఆర్ హయాంలో జెడ్ స్పీడ్‌లో..

హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.5937కోట్ల అంచనా వ్యయంతో జీహెచ్‌ఎంసీ 42 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. 42 ఫ్లై ఓవర్లలో 37 చోట్ల పనులు వాయువేగంతో పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. బీఆర్ఎస్ హయాంలోనే 95 శాతం మేర పురోగతి లో ఉన్న పనులు కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తి చేసుకున్నాయి. ఈ క్రమంలోనే ఎల్బీనగర్ బైరామల్‌గూడ సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్, కుడివైపు లూప్ కవర్, ఎడమ వైపు లూప్ ఫ్లై ఓవర్లతో పాటు జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు చేపట్టిన ఫ్లై ఓవర్‌లు అందుబాటులోకి వచ్చాయి.

**పురోగతిలో ఉన్న ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులు ఇవే**

| ప్రాజెక్టు | అంచనా వ్యయం (రూ.కోట్లలో) | పూర్తి కావాల్సిన సమయం/రిమార్క్స |
|---|---|---|
| శాస్త్రీపురం ఆర్వోబీ | 71 | ఈ నెలాఖరు నాటి కల్లా పూర్తి/రైల్వే శాఖతో సమన్వయ లోపం |
| ఫలక్‌నుమా ఆర్వోబీ | 47.10 | ఈ నెలాఖరు నాటికల్లా/ప్రార్థన మందిరాలు/ రైల్వే శాఖ సమన్వయం లోపం |
| శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ (స్టేజీ–2) | 275 | వచ్చే మే నాటికి/ వెంటాడుతున్న భూ సేకరణ సమస్య |
| నల్గొండ క్రాస్‌రోడ్ నుంచి ఓవైసీ హాస్పిటల్ జంక్షన్ నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ | 620 | వచ్చే నవంబరు నెలాఖరుకు |
| ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్ | 311 | వచ్చే మే నెలాఖరుకు/ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో సమన్వయ లోపం |

### ఎడతెగని జాప్యంతో..

చంచల్‌గూడ ప్రభుత్వ ముద్రణాలయం చౌరస్తా నుంచి సంతోష్‌నగర్ ఓవైసీ చౌరస్తా వరకు నాలుగు లైన్ల రోడ్డును 320 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన నాలుగు కిలోమీటర్ల చేపట్టిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను 2020 జూలై 23న అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. స్టీల్ బ్రిడ్జిలో 88 పిల్లర్లతో ఏర్పాటు చేస్తున్న పనులతీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



శిల్పా లే అవుట్ వద్ద..



ఉప్పల్ జంక్షన్ సమీపంలోని రామంతాపూర్‌లో మూడు నాలుగు పిల్లర్ల వద్దే ఆగిపోయిన ఫ్లై ఓవర్ నిర్మాణం

# వెల్ నెస్ సెంటర్లకు సుస్తీ చేసింది

ఓపీ కోసం గంటలకొద్దీ ఎదురుచూపులు

ఒక్క మందూ దొరకని స్థితి

సిటీ బ్యూరో, మార్చి 03 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు ఆరోగ్య సేవలందించే ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్లు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. వైద్యంకోసం వచ్చే వారికి నీరసం తప్ప సకాలంలో వైద్యం అందడం లేదు. వెల్‌నెస్ కేంద్రాల్లో నాడీ పట్టే వైద్యులు సరిపడా లేకపోవడంతో ఇబ్బందులపాలవుతున్నారు.

### ఓపీలో ఒక్కరే..

హైదరాబాద్ జిల్లాలో ఉన్న ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్ సమస్యల నిలయంగా మారింది. గత ప్రభుత్వంలో ఓపీల తాకిడితో కిటకిటలాడేది. ప్రస్తుతం అనుకున్న స్థాయిలో జనాలు రాకపోవడంతో ఓపీ రోగుల సంఖ్య తగ్గడం గమనార్హం. వచ్చినవారికి సైతం సకాలంలో వైద్యం అందించేందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు. పొరుగు సేవల ప్రాతిపాదికన నియామకమైన వైద్య సిబ్బందిలో చాలా మంది రిటైర్డ్ వైద్యులున్నారు. వారంతా ఒకపక్క అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మరో పక్క పేషెంట్లకు సేవలందిస్తున్నారు. గతంలో ఓపీ సేవల్లో జనరల్ ఫిజీషియన్లు ముగ్గురు ఉండేవారు. సోమవారం ఒక్కరు మాత్రమే ఓపీలో సేవలందించడం వల్ల రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రోగికి రాసిన మందుల్లో సగం మాత్రమే ఆసుపత్రిలోని ఫార్మసిలో లభించగా, మిగతావి వారంరోజుల్లోగా వస్తాయంటూ సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం గమనార్హం. దీర్ఘకాలపు జబ్బులకు మందులు లేకపోవడంతో ప్రైవేట్ ఫార్మసీల్లో డబ్బులు పెట్టి కొనుక్కునే పరిస్థితి నెలకొనడంతో వైద్యంకోసం వచ్చేవారంతా ఇబ్బంది పడుతున్నారు.



### నిర్లక్ష్యపు సమాధానాలు..

వెల్‌నెస్ కేంద్రంలోని పలువురు కిందిస్థాయి ఉద్యోగులు రోగుల పట్ల నిర్లక్ష్యపు వైఖరితో ఉన్నారు. వైద్యం చేయించుకునే సందర్భంలో సందేహాలు అడిగినా, మిగతా మందులు ఎప్పుడొస్తాయని అడిగినా కూడా సరైన సమాధానం ఇవ్వకుండా వ్యవహరిస్తుండటం గమనార్హం. సిబ్బంది వైఖరిపై రోగులు అసహనంతో ఉన్నారు.

## రాజేంద్రనగర్‌లో ఉప ఎన్నికలు ఖాయం

**బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి**

బండ్లగూడ, మార్చి 3. రాజేంద్రనగర్ లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడం తథ్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన సుధాకర్‌గౌడ్‌తో పాటు పలువురు యువకులు నాయకులు పెద్ద ఎత్తున కార్తీక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నదంటూ విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహిస్తున్నారని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రజలు నాయకులు యువకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లోకి చేరేందుకు ఉత్సాహం చెబుతున్నారని ఆయన తెలిపారు. కాగా, రాజేంద్రనగర్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తామని బండ్లగూడ జాగీర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, శాంతి నాయక్, రాముడు యాదవ్, పాల్గొన్నారు.



మూసీ సుందరీకరణ పేరుతో..

## సర్కారు మా ఇళ్లను కూల్చేసింది

హక్కుల నేత మేథాపాట్కర్ కు గోడు విన్నవించుకున్న నిర్వాసితులు

బాధితులతో కలిసి ఉద్యమిస్తాం- పాట్కర్

మలక్‌పేట మూసీ తీరంలో నిర్వాసితులకు పరామర్శ

మలక్ పేట, మార్చి 3: మూసీ తీరంలో నిర్వాసితులతో కలిసి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని నర్మదా బచావో ఉద్యమకారిణి, హక్కుల నేత మేథాపాట్కర్ హెచ్చరించారు. సోమవారం పాత మలక్ పేట డివిజన్ శంకర్ నగర్ లోని మూసీ నిర్వాసితుల కాలనీల్లో పర్యటించారు. మూసీ నిర్వాసితులకు సరైన న్యాయం జరగలేదన్న సమాచారాన్ని అందుకున్న ఆమె సోమవారం ఉదయం 8 గంటలకు మూసీ సుందరీకరణ కోసం ఇళ్లు కూలగొట్టిన కాలనీలో పర్యటించారు. అక్కడి బాధితులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం తమ ఇళ్లను కూల్చివేసిందని రోదించారు. ఒక్కో ఇంట్లో మూడు నాలుగు కుటుంబాలు నివసించేవని ఇప్పుడు వారంతా దిక్కూ మొక్కు లేక నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు వందల గజాల స్థలంలో నిర్మించిన ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు నివసించేవని, మూసీ సుందరీకరణ పేరుతో తమ నివాసాలను కూల్చివేసిన అధికారులు, తమకు ఒకే ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించి చేతులు దులుపుకోవడంతో మిగతా రెండు, మూడు కుటుంబాలు రోడ్డున పడ్డాయని గోడును వెళ్లబోసుకున్నారు. మూసీ నిర్వాసితులకు ఇండ్ల పరంగా కాకుండా, కుటుంబాల పరంగా లెక్క వేసి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని కోరారు. పాత మలక్ పేట డివిజన్ లోని శంకర్ నగర్, మూసారాంబాగ్ డివిజన్ లోని అంబేద్కర్ హట్స్, అజయ్ హట్స్, జాంబవంతుని హట్స్, సాయిలు హట్స్ ప్రాంతాలు మూసీ బెడ్‌లో ఉన్నాయని సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చివేశారని చెప్పారు. నగరంలోని ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు రోజుల క్రితం వచ్చిన ఆమె, సోమవారం పాత మలక్ పేటలోని శంకర్ నగర్ నివాసం ఉంటున్న సామాజిక కార్యకర్త, మానవ హక్కుల వేదిక జంట నగరాల ఉపాధ్యక్షుడు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకున్న ఆమె అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మూసి నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె, బాధితులకు న్యాయం చేకూరేలా పోరాడాలన్నారు. కాగా ఆమె పర్యటనపై సమాచారాన్ని అందుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు వెంటనే ఆమెను అక్కడి నుంచి వెళ్లిపోవాలని పట్టుబట్టి పంపించివేశారు.